మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 13.3.2025 | కరీంనగర్ KARIMNAGAR | పేజీలు: 16 Pages: 16 | సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 257 ॥ వెల (Price) రూ.6.50

చతుర్దశి

గురువారం, సూర్యోదయం: 6-26, సూర్యాస్తమయం: 6-25. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం శిశిర రుతువు ఫాల్గుణ మాసం శుక్ల పక్షం తిథి: చతుర్దశి ఉదయం 10-35 వరకు, తదుపరి పౌర్ణమి. నక్షత్రం: పూర్వఫల్గుణి పూర్తి. వర్జ్యం: పగలు 12-50 నుంచి పగలు 2-30 వరకు. రాహుకాలం: పగలు 1-55 నుంచి పగలు 3-25 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-25 నుంచి ఉదయం 11-13 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-13 నుంచి సాయంత్రం 4-01 వరకు. అమృతకాలం: రాత్రి 11-19 నుంచి రాత్రి 1-04 వరకు. కామ దహనం.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

భాష సిగ్గు పడుతుందేమో!
అక్షరం తలదించుకుంటుందేమో!
వ్యాకరణం వ్యాకులపడుతుందేమో!

నాలుక అందరికీ ఉంటుంది. భాష అందరికీ వస్తుంది. అంతమాత్రాన సమయం, సందర్భం అక్కరలేదా? ఏది పడితే అది వదిలేయడమేనా? ఎక్కడ, ఏ సందర్భంలో, ఎవరి ముందు మాట్లాడుతున్నామో తెలియాలి. కనీసం తన హోదానైనా గుర్తెరగాలి. ఎదుటివారి వయస్సు, యశస్సు అయినా గుర్తుండాలి. ఏది ఉచ్చం, ఏది నీచం అర్థంకావాలి. తన చరిత్ర, ఎదుటివారి చరిత్ర తెలిసి ఉండాలి. తలెత్తుకోగల అనుభవం ఎవరిదో, తల దించుకునే గతం ఎవరిదో గుర్తుకురావాలి.

అధికారానిది ఏముంది? పదిమంది ఇటు దూకితే నిలిచిన పదవి, పదిమంది అటుదూకితే గల్లంతవుతుంది. ఢిల్లీలో గంట కొడితే రాష్ట్రంలో ఇంటికెళ్లాల్సి వస్తుంది. ఈ నాలుగు రోజుల బాగోతానికి పట్టపగ్గాల్లేకుండా, ప్రాస కలిసిందని ఎంతొస్తే అంత అనేయడమేనా? తానేదో పదవిలో శాశ్వతంగా ఉండబోతున్నట్టు, అధికార గర్వం తలకెక్కి ఆడుతున్నట్టు, నోటి మీద అదుపే లేనట్టు, అంత దిగజారుడుతనమేమిటి? ఉమ్మడి రాష్ట్రంనుంచి ఇప్పటిదాక అనేకమంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. కటువైన విమర్శలను కూడా చిరునవ్వుతో స్వీకరించిన వారున్నారు తప్ప, ఎవరూ ఇంత దిగజారుడు భాష వాడినవారు లేరు. ఇంత అసహనం, అభద్రతాభావంతో కొనసాగినవారూ లేరు.


ఒక మనిషి చావు గురించి మాట్లాడటమే సంస్కారహీనం. ఒక మనిషి చావును కోరుకోవడం పరమ నీచం. పాలకుడు అందరి బాగును ఆకాంక్షించాలి. ఈ మాత్రం తెలుసుకోలేని వ్యక్తి సారథి కావడం దౌర్భాగ్యం. రాజకీయమంటే తిట్లా? రాజకీయమంటే చావులు కోరుకోవడమా?

ఏం తప్పు చేశాడని కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నరు? తెలంగాణ కోసం ఉద్యమించడమా? ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రం తేవడమా? దాన్ని అభివృద్ధి చేయడమా? ఏంది కేసీఆర్ చేసిన తప్పు? ఎందుకాయన మరణాన్ని కోరుకుంటున్నరు?

**రేవంత్ మాట్లాడింది ఏం భాష?**
**అది కోరికా లేక బెదిరింపా?**

## మరి ముఖ్యమంత్రే తిడితే?!

సీఎంను తిట్టిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారన్న ఆరోపణ మీద, ఇద్దరు తెలంగాణ ఆడబిడ్డలు, నేటి తరం జర్నలిస్టులు రేవతి, తన్విలను పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు పంపారు. ముఖ్యమంత్రిని తిడితే వారిపై కేసులు పెట్టారు.. సరే; మరి ముఖ్యమంత్రే మరొకరిని తిడితే?!



> మీకు మీరు మాకు స్టేచర్ ఉన్నదని అనుకుంటే, ఆ స్టేచర్ ఉన్నదని విర్రవీగితే, స్ట్రెచర్ మీదకు పంపించిన్రు. ఇట్లే చేస్తే ఆ తరువాత మార్చురీకి పోతరు. అది కూడా గుర్తు పెట్టుకోవాలి!

తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ అభివృద్ధి ప్రదాత, 70 ఏండ్ల కురు వృద్ధుడు, దేశంలోనే సీనియర్ రాజకీయ వేత్తల్లో ఒకరైన తెలంగాణ జన మనో నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురించి, బుధవారం ఒక బహిరంగ ప్రభుత్వ కార్యక్రమంలో, అందునా పిల్లలకు చదువు చెప్పే లెక్చరర్లకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చే ప్రోగ్రామ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి.

# చేవలేక చావుభాష

## పాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్ అసందర్భ సంధి ప్రేలాపనలు

### శిఖర ప్రాయుడైన కేసీఆర్‌తో రణం చేయలేక మరణపు మాట

**ముఖ్యమంత్రి నోట దారుణ భాష**

**సంతులనం కోల్పోతున్న రేవంత్**

**రోజురోజుకూ మరింత కిందికి!**



తిట్టుడే రాజకీయం అయితే, అటువంటి రాజకీయం ఆమోద యోగ్యమే అయితే, గత కొన్నేండ్లుగా రేవంత్ నేర్చిన, నేర్పిన తిట్ల కన్నా వందరెట్ల తిట్లతో ప్రజలిప్పుడు కాంగ్రెస్‌ను, దాని పరిపాలనను తిడుతున్నారు. మరి తిట్లే రాజకీయమైనప్పుడు తిట్టిన ప్రజల మీద కేసులు ఎందుకు పెడుతున్నట్టు?

> నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని తెలంగాణలో సామెత ఉన్నది. పూర్వకాలంలో చాణక్యుడు చెప్పాడు. ' ఈ లోకంలోని మనుజులు మధురముగా మాట్లాడేవారిని ప్రేమిస్తారు' అని..!! అర్థం చేసుకోవడానికి పాండిత్యమైనా ఉండాలి, లేదా పామరత్వమన్నా ఉండాలి! దురదృష్టమేమిటంటే ప్రస్తుత తెలంగాణ పాలకులకు ఆ రెండే లేవు. అదే అసలు సమస్య!

- మరుగుజ్జు నాయకుడి మానసికవైకల్యం: దంటు కనకదుర్గ
- రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఈ మాటలా?: గుమ్మడిదల
- ముఖ్యమంత్రి రేవంత్ క్షమాపణ చెప్పాలి: కే శ్రీనివాస్
- బూతులను నమ్ముకొని రాజకీయమా?: బుద్ధా మురళి
- అనారోగ్యాన్ని కూడా గేలిచేస్తారా?: బద్రి నర్సన్
- కాంగ్రెస్ పార్టీ దీనికి జవాబు చెప్పాలి: డీ పాపారావు
- కాంగ్రెస్ శవపేటికకు చివరి మేకు: పంజుగుల శ్రీశైల్‌రెడ్డి
- తరిమివేసే రోజు ఎంతో దూరం లేదు: వీ ప్రకాశ్
- ప్రజాస్వామిక విలువలకు విరుద్ధం: వేణుగోపాలస్వామి

- మర్యాదకున్న అన్ని హద్దులూ దాటేశారు.. గెట్‌వెల్ సూన్ చీప్ మినిస్టర్: కేటీఆర్
- మెచ్యూరిటీ లేకనే మార్చురీ వ్యాఖ్యలు: హరీశ్‌రావు
- వెంటిలేటర్‌పై కాంగ్రెస్.. తులసి తీర్థమే ఆలస్యం: నిరంజన్‌రెడ్డి
- ముఖ్యమంత్రి హోదా దిగజార్చారు: ప్రశాంత్‌రెడ్డి
- సీఎం కుర్చీలో శకుని కూర్చున్నట్టుంది: గంగుల
- ఈ దుశ్చర్యను తెలంగాణ గమనిస్తున్నది: కవిత
- మూర్ఖపు ముఖ్యమంత్రికి శాస్తి తప్పదు: పల్లా
- రేవంత్‌ను తెలంగాణ సమాజం క్షమించదు: వద్దిరాజు
- ఇది తెలంగాణ ప్రజలను అవమానించే చర్య : దేశపతి శ్రీనివాస్

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ).. స్వయంగా తాను సమస్యల వలయంలో చిక్కుకుని, యావత్ తెలంగాణను సంక్షోభం ముంగిట నిలిపి, సమాజంలోని సబ్బండ వర్గాలను సతాయిస్తూ, రాష్ట్రాన్ని పరిపాలనపరమైన అగాధంలోకి నెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దీన్నుంచి ఎలా బయటపడాలో తెల్వని అయోమయ గందరగోళ పరిస్థితిలో, మరోసారి హద్దు దాటారు. విమర్శలకు జవాబు చెప్పలేక విస్మయకర రీతిలో మాట మీరారు. ఒక ప్రభుత్వ కార్యక్రమంలో, అందునా పిల్లలకు చదువు చెప్పే లెక్చరర్లకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చే చోట తెలంగాణ సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఉద్దేశించి, కనీసం మానవత్వం లేకుండా అనగూడని మాటలన్నారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలో, ఆ మాటకొస్తే దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తన రాజకీయ ప్రత్యర్థి మరణాన్ని కోరుకుంటున్నట్టుగా ఆయన విపరీత వ్యాఖ్యలు చేశారు. బుధవారం రవీంద్రభారతిలో, జూనియర్ లెక్చరర్లకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ముఖ్యమంత్రి అసందర్భంగా, అనుచిత పదజాలంతో కేసీఆర్‌ను పరోక్షంగా నిందించారు. ఆయన అన్నమాటలు యథాతథంగా! '' నేను ఒక్కటే ఈ ప్రభుత్వ ఉద్యోగ మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్న. ఈ ప్రభుత్వం మీది. నేను కస్టోడియన్‌ను మాత్రమే. నేను మీ అందరి తరపున సమన్వయం చేసే వాడ్నే. నాకంటూ ప్రత్యేకంగా కిరీటం ఏం లేదు. నాకేదో ఒక పెద్ద స్టేచర్ (అది స్టేచర్ కాదు; స్టేచర్. కానీ సీఎం అన్నిసార్లూ స్టేచర్ అనే పలికారు) ఉన్నదని కొంత మంది స్టేచర్.. స్టేచర్... మా స్టేచర్ పెద్దదని, ఇంతకు ముందే మా ఎమ్మెల్యేలు చెప్తున్నారు. స్టేచర్ ఉన్నాయన స్టేచర్ మీదకు పోయిండు. స్టేచర్ మీద నుంచి మార్చురీకి పోతడు రేపు పొద్దుగాలె అని. స్టేచర్ అనేది పొజిషన్‌కు ఉంటది. ఇండివిడ్యువల్‌కు ఉండదు. ఇండివిడ్యువల్ పర్సన్‌కో, ఇండివిడ్యువల్ కాస్ట్‌కో స్టేచర్ ఉండదు. ఎమ్మెల్యేకు స్టేచర్ ఉంటది, ప్రభుత్వ ఉద్యోగికి స్టేచర్ ఉంటది, ఎమ్మెల్యేకు స్టేచర్ ఉంటది, ఎంపీకి స్టేచర్ ఉంటది, ఎమ్మెల్సీకి స్టేచర్ ఉంటది, మంతికి స్టేచర్ ఉంటది, ముఖ్యమంత్రికి ఉంటది, గవర్నర్‌కు ఉంటది, ప్రధాన మంత్రికి ఉంటది, రాష్ట్రపతికి ఉంటది. ఆ కుర్చీకి స్టేచర్ ఉంటది. మీకు మీరు మాకు స్టేచర్ ఉన్నదని అనుకుంటే, ఆ స్టేచర్ ఉన్నదని విర్రవీగితే స్టెచర్ మీదకు పంపించిన్రు. ఇట్లే చేస్తే ఆ తరువాత మార్చురీకి పోతరు. అది కూడా గుర్తు పెట్టుకోవాలి.'' ఇవీ రేవంత్ అన్న మాటలు. కొద్ది నెలల క్రితం కేసీఆర్ ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడ్డప్పుడు తుంటి ఎముక విరిగి కొంతకాలం పాటు విశ్రాంతి తీసుకున్న సంగతి తెలిసిందే.దాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి స్టెచర్, మార్చురీ అంటే నోటికొచ్చినట్టు మాట్లాడారు. సాధారణంగా అనారోగ్యానికి గురైన వారి పట్ల, ప్రమాదవశాత్తు దెబ్బతగిలిన వారిపట్ల, వయో వృద్ధుల పట్ల మానవత్వం చూపడం మనుషులు చూపే కనీస ధర్మం. కనీసం ఆమాత్రం వివేకం, విచక్షణ లేకుండా, కేసీఆర్‌కు దెబ్బతగలడాన్ని కూడా విమర్శలకు వాడుకోవడం ఏ తరహా రాజకీయమో రేవంతే చెప్పాలి. ఎవరైనా ఎల్లకాలం బతకడానికి ఈ భూమ్మీదికి రాలేదు. రేవంత్ చెప్పుకొన్నట్టు ఆయన ప్రభుత్వానికి కస్టోడియన్ అవునో కాదో తెల్వదుగానీ, ఈ భూమ్మీదికి మాత్రం ఒక అతిథి మాత్రమే! వారు, వీరు › 2వ పేజీలో

## మానసిక సమతుల్యత కోల్పోయిన రేవంత్

***ఇది ఏఐ బాట్ 'గ్రోక్' విశ్లేషణ***

హైదరాబాద్, మార్చి 12: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భాషను సామాన్యులు, మేధావులే కాదు చివరికి అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా విమర్శిస్తున్నది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ బాట్ 'గ్రోక్' కూడా సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టింది.కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను విశ్లేషించమని 'ప్యారలల్ వరల్డ్' అనే యూజర్ అడిగిన ప్రశ్నకు 'గ్రోక్' ఇలా సమాధానమిచ్చింది. 'రేవంత్‌రెడ్డి మానసిక సమతుల్యత కోల్పోయారు. ఆయన దుందుడుకు మనస్తత్వానికి ఆ వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయి. సీఎం తీవ్ర ఒత్తిడిలో ఉన్నట్టు అనిపిస్తున్నది. భావోద్వేగాలను ఆయన నియంత్రించుకోలేకపోతున్నారు' అని పేర్కొన్నది.